క్లుప్తంగా

ఆడుతూ.. పాడుతూ..


కప్ గేమ్ ఆడుతున్న విద్యార్థులు

మురళీనగర్: విద్యార్థులు ఆటపాటల్లో పాల్గొనడం ద్వారా నిరంతరం ఉత్సాహంగా ఉంటారని రిసోర్స్ పర్సన్ జి.శిరీష అన్నారు. మురళీనగర్ మహిళలు, పిల్లలు శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా శనివారం ఆటలు ఆడించి పాటలు పాడించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖాళీ సమయాల్లో తమకు ఇష్టమైన క్రీడల్లో చిన్నారులు పాల్గొనాలన్నారు. వారితో కప్ గేమ్ ఆడించారు. విద్యార్థులు కథలు చదివి వినిపించారు. లైబ్రేరియన్ వై.పద్మజ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

ఆరోగ్య కేంద్రానికి ఫ్యాన్లు వితరణ


రెండు ఫ్యాన్లు అందజేస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు అంబేడ్కర్ కాలనీలోని డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి శనివారం రెండు ఫ్యాన్లు వితరణ చేశారు. ఆరోగ్య కేంద్రంలో ఫ్యాన్లు లేక ఇబ్బందులు పడుతున్నామని అక్కడ సిబ్బంది.. కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ దృష్టికి తీసుకొచ్చారు. ఈ మేరకు ఆయన తన సొంత నిధులతో రెండు ఫ్యాన్లను డాక్టర్ వెంకటేష్, సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ పైడి శ్రీను, సారిక నూకరాజు, కరిమిరెడ్డి శ్యామ్, గణేష్, ధర్మేంద్ర, లక్ష్మీనారాయణ, యూపీహెచ్‌సీ స్టాఫ్ నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం దిశగా 'గ్రీవెన్స్'


అర్జీలు స్వీకరిస్తున్న సమన్వయకర్త కె.కె.రాజు

సీతమ్మధార: నియోజకవర్గ ప్రజల సమస్యలు పరిష్కరించే దిశగా గ్రీవెన్స్ ఏర్పాటు చేసినట్లు నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు తెలిపారు. బాలయ్య శాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రజల వద్ద నుంచి ఆయన వినతిపత్రాలు స్వీకరించారు. తమ సమస్యలు పరిష్కరించాలని వారు మొర పెట్టుకున్నారు. కె.కె.రాజు అర్జీలను పరిశీలించి కొన్నింటిని తక్షణం పరిష్కరించారు. మిగిలిన వాటిని సంబంధిత అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రహదారిని ఆక్రమించి పనులు


బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని ఓ రోడ్డులో అడ్డంగా వేసిన భవన నిర్మాణ సామగ్రి

సీతమ్మధార: రహదారులను ఆక్రమించి భవన నిర్మాణ పనులు చేపట్టడం వల్ల వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందులకు గురవుతున్నారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని ఫుడ్‌ఎక్స్ పక్కనున్న రోడ్డులో గృహ సముదాయం నిర్మిస్తున్న ఓ యజమాని ఇసుక, పిక్క అక్కడ డంప్ చేయించి పనులు చేయిస్తున్నారు. రోడ్డును ముప్పావువంతు ఇవి ఆక్రమించడంతో స్థానికులు, వాహన చోదకులు ఇబ్బంది పడుతూ రాకపోకలు సాగిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

పబ్లిక్ డిమాండ్

పోలీస్ స్టేషన్‌లోకి వెళ్లే దారేది..!

సీతమ్మధార: ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ లోపలి నుంచి ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లే మార్గంలో ద్విచక్ర వాహనాలు నిలిపి ఉంచడంతో ఫిర్యాదుదారులు ఇబ్బంది పడుతున్నారు. దారి ఇరుగ్గా ఉండటంతో స్టేషన్‌కు వచ్చే వారికి సమస్యగా మారింది. స్టేషన్ అధికారులు స్పందించి ఫిర్యాదుదారులకు ఇబ్బంది లేకుండా తగు చర్యలు చేపట్టాలి.
– టి.వరహాలు, బాలయ్యశాస్త్రి లేఅవుట్


ద్వారకా పోలీస్ స్టేషన్‌కు వెళ్లే మార్గంలో అడ్డంగా ద్విచక్ర వాహనాలు

తవ్వి వదిలేసిన రహదారులతో ఇబ్బందులు


ముస్లిం తాటిచెట్లపాలెంలో తవ్వి వదిలేసిన రోడ్డు

సీతంపేట: జీవీఎంసీ 44వ వార్డు ముస్లిం తాటిచెట్లపాలెంలోని 44–15–33 ఇంటి నంబర్ సమీపంలో రహదారులు చాలా ఇరుగ్గా ఉంటాయి. 24/7 నీటి సరఫరా కోసం పైప్‌లైన్లు వేయడానికి రహదారులు తవ్వారు. పనులు పూర్తయి రెండు నెలలు గడిచిపోయింది. వాటిని మాత్రం పునరుద్ధరించలేదు. అసలే ఇరుకు రోడ్డు, ఆపై తవ్వి వదిలేసిన గోతులతో ఇబ్బంది పడుతున్నాం. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాలి.
– కె.ఈశ్వర ప్రసాద్, ముస్లిం తాటిచెట్లపాలెం

శివనగర్ జంక్షన్‌లో

అంధకారం


శివనగర్ జంక్షన్‌లో వెలగని వీధిలైటు

మద్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు శివనగర్ జంక్షన్‌లోని వీధిలైటు వెలగకపోవడంతో స్థానికులు ఇబ్బందులకు ఎదుర్కొంటున్నారు. గతంలో ఈ సమస్యపై ‘సాక్షి’లో వార్త ప్రచురించిన చాలా కాలం తర్వాత విద్యుత్ విభాగం వారు స్పందించి ఒక లైటు అమర్చారు. అయితే కొన్ని రోజులుగా ఆ లైటు వెలగకపోవడంతో ఇబ్బందులు మళ్లీ మొదలయ్యాయి. రాత్రి వేళ జంక్షన్ మలుపులో ఉన్న రోడ్డులో ప్రయాణించే వారు ప్రమాదాల బారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సక్రమంగా వీధిలైటు వెలిగేలా చర్యలు చేపట్టాలి.
– విజయ్, శివనగర్

రైల్వే హాస్పిటల్‌లో ఆరోగ్య, రక్తదాన శిబిరాలు

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజనల్ రైల్వే హాస్పిటల్‌లో శనివారం ఉచిత ఆరోగ్య అవగాహన, హెల్త్ చెకప్, రక్తదాన శిబిరాలు నిర్వహించారు. రైల్వే ఉద్యోగులు, స్థానికులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించి, వారికి అవసరమైన వైద్య పరీక్షలు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఫ్రీ హెల్త్ చెకప్, రక్తదాన శిబిరాలను వాల్తేర్ డివిజన్ మెడికల్ విభాగం, ఏఎస్ రాజా వాలంటరీ బ్లడ్ బ్యాంకులు సంయుక్తగా నిర్వహించాయి. కార్యక్రమాలను చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ తిరు అరుల్ జోతి పర్యవేక్షణలో ముఖ్య అతిథి డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఎం మాట్లాడుతూ రైల్వే ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ప్రతీ ఒక్కరూ రెగ్యులర్‌గా వైద్య పరీక్షలు చేయించుకుంటూ, తగిన జాగ్రత్తలు తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు.


మాట్లాడుతున్న డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి

సుమారు 50 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. రైల్వే ఉన్నతాధికారులు సీనియర్ డివిజనల్ ఇంజినీర్(కోఆర్డినేషన్) ఎ.కె.మహారాణా, డివిజనల్ ఇంజినీర్(వెస్) అభిషేక్, జోనల్ సివిల్ ఇంజినీరింగ్ ట్రైనింగ్ సెంటర్‌లో శిక్షణ పొందుతున్న ట్రైనీలతోపాటు పలువురు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు కొండవాలు ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు, ఒకవేళ అవి వచ్చినా వెంటనే విద్యుత్‌ను పునరుద్ధరించేందుకు అవసరమైన చర్యలను విద్యుత్ శాఖ అక్కయ్యపాలెం సెక్షన్ సిబ్బంది శనివారం చేపట్టారు. కొండవాలు ప్రాంతాల్లో విద్యుత్ సమస్య వస్తే కంచరపాలెం లేదా సీతమ్మధార సబ్ స్టేషన్ల నుంచి విద్యుత్‌ను పునరుద్ధరించేవారు. ఈ ప్రక్రియకు సుమారు గంట సమయం పట్టేది. అంతవరకు కొండవాలు ప్రాంతాల్లో విద్యుత్ ఉండేది కాదు. దీనిని పరిష్కరించేందుకు ఏపీఈపీడీసీఎల్ జోన్–1 ఆపరేషన్స్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.సత్యనారాయణ, డీఈఈ ఎ.విద్యాసాగర్‌ల ఆదేశాలతో అక్కయ్యపాలెం సెక్షన్ సిబ్బంది ప్రత్యామ్నాయం ఏర్పాటు చేశారు. పోర్టు ఇండోర్ స్టేడియంలోని 33/11 సబ్ స్టేషన్ నుంచి అవసరమైన పనులు చేపట్టారు. దీని కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే వెంటనే స్టేడియం సబ్ స్టేషన్ నుంచి విద్యుత్‌ను పునరుద్ధరించనున్నారు.



నరసింహనగర్‌లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది

జనం కోసం

పారిశుధ్య సమస్యా.. ఫోన్ చేయండి

కంచరపాలెం: జీవీఎంసీ జోన్–5 పరిధిలో ప్రజా ఆరోగ్యం, పారిశుధ్య పనులకు సంబంధించి అధికారులు అందుబాటులో ఉన్నారు. ఉత్తర నియోజకవర్గంలోని 42 నుంచి 51, 53, 54, 55 వార్డుల వరకు గల 13వ వార్డులకు సంబంధించిన పారిశుధ్య సమస్యలపై అధికారులకు ఫోన్ ద్వారా తెలియజేయవచ్చు. వీధులు, రహదారుల వద్ద చెత్త పేరుకుపోవడం, కాలువలు, గెడ్డల్లో పూడికలు తీయకపోవడం, పారిశుధ్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడ వంటి సమస్యలపై ఆయా వార్డుల శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, హెల్త్ అసిస్టెంట్లకు ఫోన్ కాల్ చేసి సమాచారం అందించాలని జోన్–5 పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.రాజేష్ తెలిపారు. అలా కాని పక్షంలో జ్ఞానాపురంలోని జోన్–5 కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమంలో జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణకు ఫిర్యాదులు చేయవచ్చని చెప్పారు.


పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఏఎంహెచ్‌వో డాక్టర్ రాజేష్

జీవీఎంసీ జోన్–5 పబ్లిక్ హెల్త్ అధికారుల వివరాలు

వార్డు నం.	అధికారి	బాధ్యత	ఫోన్ నంబర్
జోన్–5	డాక్టర్ ఎ.రాజేష్	ఏఎంహెచ్‌వో	99480 95520
జోన్–5	ఎస్.జనార్దనరావు	శానిటరీ సూపర్‌వైజర్	70363 96919
41	డి.వి.వి.ఎస్.ఎస్.ఎం.ప్రసాద్	శానిటరీ ఇన్‌స్పెక్టర్	99488 83942
42	ఎం.సన్యాసిదొర	హెల్త్ అసిస్టెంట్	77299 95924
43.	అప్పారావు	ఔట్ సోర్సింగ్ ఇన్‌చార్జి	99665 91821
44.	ఎన్.సూరిబాబు.	శానిటరీ ఇన్‌స్పెక్టర్	99488 83938
45	కె,పాండురంగా	హెల్త్ అసిస్టెంట్	99488 83932
46	వి.సత్యం	శానిటరీ ఇన్‌స్పెక్టర్	80085 36403
47	కె.వి.రమణమూర్తి	శానిటరీ ఇన్‌స్పెక్టర్	99488 83970
48	డి.అప్పలరాజు	శానిటరీ ఇన్‌స్పెక్టర్	90103 93037
49	ఎం.రామకృష్ణ	శానిటరీ ఇన్‌స్పెక్టర్	99488 83937
50	ఎం.సుధాకర్	హెల్త్ అసిస్టెంట్	94941 83244
51	ఎం.సుధాకర్	హెల్త్ అసిస్టెంట్ ఇన్‌చార్జి	94941 83244
54	వై.త్రిమూర్తులు	మేస్త్రీ	99488 83947
55	ఉప్పిలి కార్తీక్	హెల్త్ అసిస్టెంట్	91105 97632

వెలిగిన వీధిలైటు


గాంధీనగర్‌లో విద్యుత్ లైటు వెలుగులు

సాక్షి ఎఫెక్ట్..

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు గాంధీనగర్‌లో వీధిలైటు వెలుగుతోంది. ఈ ప్రాంతంలో విద్యుత్ లైటు వెలగకపోవడంతో స్థానికులు పడుతున్న ఇబ్బందులపై ఈ నెల 21న ‘వీధిలైటు వెలిగించండి’ శీర్షికన ‘సాక్షి’లో వార్త ప్రచురితమైంది. సంబంధిత అధికారులు స్పందించి ఆ ప్రాంతంలో ఇప్పుడు లైట్లు ఏర్పాటు చేశారు. వరుసగా వీధిలైట్లు వెలగడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

చదరంగం శిక్షణకు విశేష స్పందన


విద్యార్థులకు మెళకువలు వివరిస్తున్న ఉమాపతి

మురళీనగర్: స్థానిక వాకర్స్ పార్క్‌లో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చదరంగం శిక్షణకు విశేష స్పందన లభిస్తోంది. ఐదు రోజులుగా జరుగుతున్న తరగతులు శనివారం కూడా కొనసాగాయి. సుమారు 60 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. చదరంగం శిక్షకుడు ఎస్.ఉమాపతి చదరంగంలోని మెలకువలు నేర్పించారు. తల్లిదండ్రులు కూడా పిల్లలతోపాటు పాల్గొని వారిని ప్రోత్సహిస్తున్నారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లా చంద్రమౌళి, ఎల్.వి.సుధాకర్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

సీతమ్మధార: ఉత్తర నియోజకవర్గ అభివృద్ధి పనులపై శనివారం కార్పొరేటర్లతో నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త కె.కె.రాజు సమీక్ష నిర్వహించారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి వార్డులోనూ పలు అభివృద్ధి పనులు జోరుగా జరుగుతున్నాయన్నారు. జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, స్టాండింగ్ కమిటీ మెంబర్ బర్కత్ ఆలీ, కార్పొరేటర్లు, పార్టీ అనుబంధ సంఘాల జోనల్ ఇన్‌చార్జి పీలా వెంకటలక్ష్మి, సీనియర్ నాయకులు, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

మురళీనగర్: మద్రిపాలెం సెక్షన్ పరిధిలోని ఇండస్ట్రియల్ ఎక్స్‌ప్రెస్, ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ 11 కేవీ ఫీడర్ల నిర్వహణ పనులు కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్–2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

‘సెల్ టవర్ వద్దు’

మద్రిపాలెం: సెల్‌ఫోన్ టవర్ ఏర్పాటు చేయొద్దని స్థానికులు శనివారం ఆందోళనకు దిగారు. పట్టాభిరెడ్డితోటలో ఓ కంపెనీ అనుమతులతో సెల్ టవర్ వేసేందుకు ప్రయత్నించగా.. టవర్ ఏర్పాటు చేస్తే రేడియేషన్‌తో అనారోగ్యాలు వస్తాయని నివాసులు నిరసన వ్యక్తం చేశారు.

రజకులకు అండగా సీఎం జగన్

- రజక సంఘాల ఆత్మీయ సమావేశంలో కె.కె.రాజు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని శెట్టిబలిజ భవనంలో శనివారం రజక సంఘాల ముఖ్య నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు మాట్లాడుతూ రజకులకు ఎల్లప్పుడూ అండగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉంటారన్నారు. జగనన్న చేదోడు పథకం ద్వారా నియోజకవర్గంలోని 1,364 మంది రజకులకు రూ.1,36,40,000 లబ్ధి చేకూరిందని తెలిపారు. 44వ వార్డు షాదీఖానా పక్కన దోబీఘాట్ నిర్మాణానికి రూ.10 లక్షలు ఖర్చు చేశామన్నారు. రజకుల కోసం రూ.1.08 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. 50వ వార్డులో రూ.48 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మించాలని, వంశీనగర్‌లో వీఈఆర్‌సీసీ ఎస్‌డబ్ల్యూ డ్రైన్ పనులు పూర్తి చేశామన్నారు. రూ.35.90 లక్షలతో కమ్యూనిటీ హాల్‌పనులు జరుగుతున్నాయని చెప్పారు. 51వ వార్డు చిట్టిబాబు కాలనీలో రూ.14.95 లక్షలతో దోబీఘాట్ నిర్మాణానికి టెండర్ ఫైనల్ చేశారన్నారు. అనంతరం కె.కె.రాజును రజక సంఘాల నాయకులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కటారి అనిల్‌కుమార్‌రాజు, సింహాచలం దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యుడు సంపంగి శ్రీనివాసరావు, రజక సంఘాల జిల్లా అధ్యక్షుడు కోడూరి సత్యనారాయణ, పాతపట్నం రామ్మోహన్, జయనాథ్, అప్పారావు, రజక సంఘాల పెద్దలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

కంచరపాలెం: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. జీవీఎంసీ 47వ వార్డులో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ కంటిపాము కామేశ్వరితో కలిసి ఆయన సంజీవయ్య కాలనీ–1 ప్రాంతంలోని ప్రతీ ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించి, వారి సమస్యలను తెలుసుకుంటూ ముందుకు సాగారు. కార్యక్రమంలో వార్డు నాయకులు అప్పారావు, సుకుమార్, గార కృప, రాఘవులు, గురువోజీ, ఢిల్లీ ఈశ్వరరావు, అనిత, సీనియర్ నాయకులు, అధికారులు, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.


మహిళకు సంక్షేమ పథకాల కరపత్రం అందజేస్తున్న కె.కె.రాజు

వైభవుడికి సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. ఉదయం 5.30 గంటలకు ఆలయ సంప్రదాయం ప్రకారం వేదమంత్రోచ్చారణల మధ్య భక్తులు, అర్చకులు ఆలయ ప్రదక్షిణ చేశారు. శ్రీవారి మండపంలో గొల్ల సన్నిధి నిర్వహించి వేద పండితులు సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన చేశారు. సాయంత్రం 5.30 గంటలకు ఆకాశ దీపారాధన, 7 గంటలకు నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు స్వామికి సమర్పించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో వైభవుడిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.


ఆలయ ప్రదక్షిణలో అర్చకులు, భక్తులు

ఘంటసాలపై నాటకం నేడు

మద్దిలపాలెం: ఘంటసాల జీవిత చరిత్ర ఇతివృత్తంతో మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం నాటకాన్ని ప్రదర్శించనున్నామని రంగసాయి వ్యవస్థాపకులు బాదంగీర్ సాయి తెలిపారు. దేశంలో తొలిసారిగా రంగసాయి నాటక సంఘం ఆధ్వర్యంలో స్టేషన్ ఘన్‌పూర్‌కు చెందిన శ్రీసాయి సంతోషి నాట్యమండలి సురభి వారిచే భాస్కరుని సత్య జగదీష్ రచన, దర్శకత్వంలో నాటకం ప్రదర్శించనున్నట్లు చెప్పారు. సాయంత్రం 5 గంటలకు తొలి ప్రదర్శన, రాత్రి 7.30 గంటలకు రెండో ప్రదర్శన ఉంటుందన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నగర ప్రముఖులు పాల్గొనున్నారని తెలిపారు. ఇదే వేదికపై చిన్నారులతో లవకుశ పాటల ప్రదర్శన ఉంటుందని తెలియజేశారు. వివరాలకు 94404 58458 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

విద్యా కానుక కిట్ల నాణ్యత పరిశీలన

విశాఖ విద్య: జగనన్న విద్యా కానుక కిట్ల నాణ్యతపై శనివారం ప్రత్యేక బృందాలు తనిఖీ చేశాయి. 2023–24 విద్యా సంవత్సరం బడి తెరిచిన రోజునే విద్యార్థులందరికీ కిట్లు అందించేలా ఇప్పటికే పూర్తి స్థాయిలో వస్తువులన్నీ జిల్లాకు సరఫరా అయ్యాయి. వాటిని ఎంపిక చేసిన స్టాక్ పాయింట్లలో నిల్వ చేశారు. విద్యార్థులకు అందించే విద్యా కానుక కిట్లులో నాణ్యతకు పెద్దపీట వేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ నేపథ్యంలో స్టాక్ పాయింట్లలో నిల్వ చేసిన వస్తువుల నాణ్యత తనిఖీల కోసమని డీఈవో లక్ష్మణరావు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేశారు. ఎంఈవోల నేతృత్వంలో ఆయా మండలాల్లోని ముగ్గురు సీనియర్ హెచ్‌ఎంలను సభ్యులుగా ప్రత్యేక టీమ్‌లను నియమించారు. వీరంతా స్టాక్ పాయింట్లను సందర్శించి, కిట్లను సమగ్ర పరిశీలన చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. దీంతో శనివారం జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక బృందాలు స్టాక్ పాయింట్లను తనిఖీ చేశాయి. చైల్డ్ ఇన్ఫో గణాంకాల మేరకు స్టాక్ పాయింట్లకు వచ్చిన వస్తువులు, నిల్వ ఉన్న వస్తువులు, వాటి నాణ్యత వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆ నివేదిక డీఈవోకు అందజేస్తామని చినగదిలి మండల తనిఖీ బృందంలోని సభ్యులు, సీనియర్ హెచ్‌ఎం ఇమండి పైడిరాజు తెలిపారు.


చంద్రపాలెం స్టాక్ పాయింట్‌లో బూట్లు పరిశీలిస్తున్న పైడిరాజు

పర్యావరణంపై అవగాహన అవసరం

ఆరిలోవ: ఇందిరా గాంధీ జూ పార్కులో కొద్ది రోజులుగా లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. విద్యార్థులు, సందర్శకులకు పర్యావరణంపై జూ సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం జరిగిన కార్యక్రమంలో నగరంలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. వారిచే ఆంగ్ల పదం లైఫ్ ఆకారంలో నిలబెట్టి ప్రదర్శించారు. ఈ సందర్భంగా జూ క్యూరేటర్ నందనీ సలారియా మాట్లాడుతూ పర్యావరణంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ కార్యక్రమం వల్ల విద్యార్థుల్లో పర్యావరణంపై అవగాహన కలుగుతోందన్నారు. ఇందులో భాగంగా జూలో చిరుధాన్యాల వినియోగంపై అవగాహన, సీతాకోకచిలుకల సంరక్షణ తదితర వాటి గురించి విద్యార్థులకు, సందర్శకులకు ఆమె వివరించారు.


జూలో ఆంగ్ల పదం లైఫ్ ఆకారంలో విద్యార్థులు

పర్యావరణ దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

సీతంపేట: ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని ఏపీ కాలుష్య నియంత్రణ మండలి జేసీ ఇ.పి.ప్రసాదరావు కోరారు. శనివారం ఉదయం ఆయన కార్యాలయంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవానికి సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో సోమవారం ఉదయం 8 గంటల నుంచి డ్రాయింగ్, వ్యాసరచన, ఎలక్యూషన్, క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఒకటవ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. ‘సొల్యూషన్ టు ప్లాస్టిక్ పొల్యూషన్’ అనే అంశంపై పోటీలు జరుగుతాయని, చిత్రలేఖనంలో పాల్గొనే వారికి డ్రాయింగ్ షీట్ మాత్రమే ఇస్తామని తెలిపారు. వ్యాసరచన పోటీలో పాల్గొనే వారికి తెల్లకాగితాలు ఇస్తామన్నారు. అలాగే జూన్ 5న రామకృష్ణా బీచ్‌లో పర్యావరణ పరిరక్షణ కోరుతూ అవగాహన ర్యాలీ నిర్వహిస్తామని, అదే రోజు 10 గంటలకు చిల్డ్రన్ థియేటర్‌లో జరగనున్న కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. రీజినల్ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ పి.శ్రీనివాసరావు, పీసీబీ ఏఈలు మూర్తి, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న జేసీ ప్రసాదరావు